క్లుప్తంగా

అరుణాచల క్షేత్రంలో భక్తుల రద్దీ


విశేష అలంకరణలో స్వామివారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపిత కూచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పండితులు తెల్లవారుజామున స్వామివారికి సామూహిక కుంకుమ పూజలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధర్మవరంలో దసరా వేడుకలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో సోమవారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యార్థులు నవదుర్గ వేషధారణలో ప్రదర్శన ఇచ్చారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి చేసే అలంకరణలను కళ్లకుకట్టేలా విద్యార్థులు ప్రదర్శించారు. చిన్నారుల వేషధారణలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాగేశ్వరరావు, సత్యనారాయణ, సుజాత, దుర్గాభవాని, పార్వతి పాల్గొన్నారు.

135 మందికి కంటి పరీక్షలు


సిరిపురంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన గౌతమి నేత్రాలయం వైద్యుడు రమేష్ సుమారు 135 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 16 మందికి శస్త్రచికిత్సల నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


కిర్లంపూడి శ్మశానవాటికలో మొక్క నాటుతున్న నాయకులు

కిర్లంపూడి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత కోరారు. కిర్లంపూడి శ్మశాన వాటికలో మహాత్మగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయి గ్యారంటీ స్కీమ్ (ఎమ్‌జీఎన్ఆర్‌ఈజీఎస్) ద్వారా అందజేసిన సుమారు 200 కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, సాదే కుమారి, కాళ్ల వెంకటేశ్, గుదాల రాంబాబు పాల్గొన్నారు.

తుని నుంచి అన్నవరానికి పాదయాత్ర

తుని: కాపు నేత వంగవీటి రాధాకృష్ణ ఆరోగ్యం బాగు పడాలని కోరుతూ కాపునాడు రాష్ట్ర యువత జనరల్ సెక్రటరీ సూరపురెడ్డి శ్రీనివాస్ తుని నుంచి అన్నవరం సత్యదేవుని ఆలయానికి పాదయాత్ర చేశారు. సోమవారం తుని ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వంగవీటి రాధాకృష్ణ ఆరోగ్యం మెరుగుపడి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని కోరారు. పాదయాత్ర చేసిన శ్రీనివాస్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం, యోగా అలవాటు చేసుకోవాలని పవర్‌గ్రిడ్ డీజీఎం పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపాలెంలో సోమవారం పవర్‌గ్రిడ్, రాజమహేంద్రవరం కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ హాస్పటల్ డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ కిరణ్మయి, జి.తేజస్విని, సతీష్ రెడ్డి, హరికృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ కోటేశ్వరరావు, వీరేంద్ర, ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నట్లు అన్నవరం ఎస్సై కిషోర్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

తాండవ బ్రిడ్జికి మోక్షమెప్పుడో ?

- ఆరు నెలలుగా నిలిచిన నిర్మాణ పనులు
- వరదల్లో గ్రామాల మధ్య తెగిపోతున్న సంబంధాలు
- 50 గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు


అసంపూర్తిగా నిలిచిన తాండవబ్రిడ్జి నిర్మాణ పనులు

కోటనందూరు: గ్రామంలో తాండవనదిపై నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా తుపానులు, వరదల సమయంలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. తాండవనది పరివాహక ప్రాంతంలో భారీగా వర్షం కురిసినా, తాండవ జలాశయం నుంచి నది ద్వారా సముద్రానికి ఏమాత్రం నీటిని విడిచిపెట్టినా కోటనందూరులో కాజ్‌వే (బ్రిడ్జి)పై నుంచి నీరు భారీగా ప్రవహించి ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఈ బ్రిడ్జి మీదుగా ప్రయాణించే 50 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

గత ప్రభుత్వంలో నిధుల మంజూరు

సుమారు 50 గ్రామాల ప్రజలకు ఐదు దశాబ్దాల కలగా మారిన ఈ బ్రిడ్జి నిర్మాణానికి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో గత ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. గత మార్చి వరకూ పనులు శరవేగంగా సాగాయి. మరో నాలుగు నెలల్లో బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు. కాగా గత ఆరు నెలలుగా బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కథ మరలా మొదటికొచ్చింది. బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతుంటే సంతోషించిన ప్రజలు ఇప్పుడు డీలా పడ్డారు. అధికార యంత్రాంగం, ప్రస్తుత పాలకులు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

1976లో బ్రిడ్జి నిర్మాణం

తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి కోటనందూరు గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్న తాండవ నదిని దాటాల్సి ఉంది. 1976లో అప్పటి పాలకులు, రైతుల ఆర్థిక భాగస్వామ్యంతో ప్రభుత్వం రూ.13 లక్షలు ఖర్చు చేసి తాండవ నదిపై కాజ్‌వే(బ్రిడ్జి)ని నిర్మించారు. అయితే అప్పటి ప్రజల అవసరాలు, రోడ్ల పరిస్థితులకు అనుగుణంగా నిర్మించిన ఈ కాజ్‌వే ఆనాటి ప్రజలకు ఇబ్బందులు తొలగించింది. కాలక్రమంలో ఈ కాజ్‌వే శిథిలం కావడం, ఇరువైపులా రక్షణ లేకపోవడం, ఎత్తు, వెడల్పు, కింద పిల్లర్ల మధ్య దూరం తక్కువగా ఉండడం వంటి కారణాలతో ఇప్పటి ప్రజలకు మళ్లీ అవస్థలు తప్పడం లేదు. వరదల సమయంలో నదిలో నీరు కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహించి తుని–నర్సీపట్నం రోడ్డుకు, కోటనందూరు గ్రామానికి పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాజ్‌వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేయాలని గత ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు డిమాండు చేస్తున్నారు.


ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

నిర్మాణం పూర్తయితే అభివృద్ధి

కోటనందూరులో తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కోటనందూరులో తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, రౌతులపూడి, శంఖవరం మీదుగా కత్తిపూడి వద్ద 216 నంబరు హైవేకు చేరుకునేందుకు 33 కిలోమీటర్ల పొడవు గల రోడ్డు ఉంది. కోటనందూరులో తాండవ నదిపై సరైన బ్రిడ్జి లేక ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఈ రోడ్డు లూప్‌లైన్‌గానే మిగిలిపోయింది. ఇక్కడ ఉన్న కాజ్‌వే బ్రిడ్జిగా అభివృద్ధి చెందితే సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు రోడ్లు, వ్యాపార వనరులు, ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు



తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంది. వరదలు, అత్యవసర సమయాల్లో కూడా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోజుల తరబడి నీరు ఇప్పుడున్న బ్రిడ్జిపై నుంచి ప్రవహించింది. రాకపోకలకు ఎన్నో అవస్థలు పడ్డాం. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి.

వాడపర్తి సుబ్బు, కోటనందూరు

రేపటి నుంచి ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపు కోసం మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు సోమవారం తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమార్‌స్వామి బృందం ఆధ్వర్యంలో ఏలూరు, టి.రాయవరం, వాకపల్లి, పోతులూరు, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, గోకవరం, ప్రత్తిపాడు, ఉత్తరకంచి, వెంకటనగరం, ఉద్దండ జగన్నాథపురం, రౌతుపాలెం గ్రామాల్లోనూ, జేఈ బృందం ఆధ్వర్యంలో ధర్మవరం, పెద్దిపాలెం, ఒమ్మంగి, గజ్జనపూడి, శరభవరం, చింతలూరు, లంపకలోవ, బవురువాక, బురదకోట, పాండవులపాలెం, రాచపల్లి గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. ఈ గ్రామ సభలకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని ఎంపీడీఓ కుమార్‌బాబు కోరారు.

ప్రత్తిపాడు ఎస్సైగా లక్ష్మీకాంతం


లక్ష్మీకాంతం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఎస్.లక్ష్మీకాంతం సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ దిశ పోలీస్ స్టేషన్ నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎస్సై ఎం.పవన్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పవన్‌కుమార్ కాకినాడ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ)కు బదిలీపై వెళ్లారు. స్థానిక ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీకాంతానికి ఏఎస్సైలు, పోలీసులు స్వాగతం పలికారు.

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

- ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వడం లేదని మండిపాటు
- కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్
- వాయిదా పడిన సమావేశం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి



సమావేశాన్ని వాకౌట్ చేసి కౌన్సిల్ హాలు నుంచి బయటకు వస్తున్న కౌన్సిలర్లు

తుని: ప్రజలచే ఎన్నికైన ప్రజా ప్రతినిధులను మున్సిపల్ కమిషనర్ చిన్నచూపు చూపు చూస్తున్నారని తుని పురపాలక సంఘం సమావేశంలో కౌన్సిలర్లు మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా కౌన్సిలర్ మర్రా సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంపై సంతాప తీర్మానం ప్రవేశపెట్టి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమయంలో పలువురి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు లేచి కౌన్సిలర్ మర్రా సత్యవతి మృతి చెందిన రోజున రాజా రాజబాబు మున్సిపల్ పార్కులో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని కమిషనర్ వెంకట్రావు ఏర్పాటు చేసిన అంశంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధి చనిపోయిన విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు తెలియ పరిచకుండా ప్రభుత్వ కార్యక్రమం ఎలా నిర్వహించారని చైర్ సుధారాణి ప్రశ్నించారు. దళిత ప్రజాప్రతినిధికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు కమిషనర్ తీరుకు నిరసనగా వాకౌట్ చేసి సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లి పోయారు. అజెండాపై చర్చ జరగక పోవడంతో సమావేశాన్ని వేయిదా వేశారు.

అధికారులు ఏక పక్షంగా పని చేస్తున్నారు

అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం అధికారులు ఏక పక్షంగా పని చేస్తున్నారని చైర్‌పర్సన్ సుధారాణితో పాటు పలువురు కౌన్సిలర్లు విమర్శించారు. కాలువల్లో పూడికతీత పనుల్లోనూ ఇంజనీరింగ్ అధికారులు కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. పురపాలక సంఘంలోని 5వ వార్డుకు చెందిన కౌన్సిలర్ మర్రా సత్యవతి చనిపోతే అదే రోజు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కౌన్సిల్ చేసిన తీర్మానాలకు చట్టబద్ధత ఉంటుందని, దానికి అనుగుణంగా అధికారులు పని చేయాలని సూచించారు. కౌన్సిలర్లను అవమానానికి గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కె.రూపాదేవి, కౌన్సిలర్లు పామర్తి మహేష్, షేక్ ఖ్వాజా, రేలంగి విజయదుర్గ, పులి సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవునికి జన్మనక్షత్ర పూజలు


సత్యదేవునికి ఆయుష్యహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు, మూలవిరాట్‌లకు అభిషేకాలు నిర్వహించారు. పండితులు సత్యదేవుని ఆలయాన్ని తెల్లవారుజామున రెండు గంటలకు తెరిచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు ఘనంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరులను ముత్యాల కవచాల (ముత్తంగి సేవ) అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఘనంగా ఆయుష్య హోమం స్వామివారికి ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ అయుష్య మండపంలో స్వామివారికి ఆయుష్యహోమం నిర్వహించారు. అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరశింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు అంగర సతీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తొలుత గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడీస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత



కోటనందూరు హైస్కూల్లో కొబ్బరి మొక్క నాటుతున్న చైతన్యగోదావరి బ్యాంకు సిబ్బంది

కోటనందూరు: సమాజంలో అవినీతిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మాజీ డైరెక్టర్ డి.శివబాబురాజు అన్నారు. స్వచ్ఛతా హి సేవ, విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివబాబు మాట్లాడుతూ అవినీతిపై విద్యార్థులు అవగాహన పెంచుకోని అవినీతి రహిత సమాజ నిర్మానానికి కృషి చేయాలన్నారు. చైతన్య గోదావరి బ్యాంకు మేనేజర్ పీవీ భాస్కర్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం విద్యార్థులతో సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎన్.వేణుగోపాల్, వైద్యాధికారి యామినికావ్య, ఎస్ఎంసీ చైర్మన్ చందక శ్రీను, బ్యాంకు క్యాషియర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. స్థానిక 1వ వార్డులో సోమవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పట్టణ ప్రజలు స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సముద్ర తీరంలో స్వచ్ఛ భారత్


కొత్తచోడిపల్లిపేట సముద్ర తీరంలో వ్యర్థాలు తొలగిస్తున్న విద్యార్థులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం కొత్తచోడిపల్లిపేట సముద్ర తీరంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మెహర్, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి తీరంలో పాస్టిక్, ఇతర కాలుష్య వ్యర్థాలను తొలగించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా పర్యావరణానికి కలిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము, వైస్.ప్రిన్సిపాల్ దివాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు


తునిలో సామూహిక సీమంతాలు చేస్తున్న చేస్తున్న అధికారులు

తుని: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని తుని అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత సూచించారు. స్థానిక బ్యాంకు కాలనీ ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం పోషకాహార మాసోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై 25 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల లోపు చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. తుని విన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నళిని, విజయ, అనురాధ, దేవి, పద్మ మహిళలకు చీరలు అందించారు. రోటరీక్లబ్ తరఫున వేరుశనగ చిక్కీలు, పండ్లు, గాజులు అందజేశారు. కార్యక్రమంలో ఎసీడీపీవో నిహారిక, మెప్మా సీవోలు వెకంటలక్ష్మి, సుభద్ర, సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సరస్వతీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించవద్దు


తుని రూరల్, పట్టణ సీఐలతో శాంతిభద్రతలపై చర్చిస్తున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్: నియోజకవర్గంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైన ఉపేక్షించవద్దని తుని రూరల్, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు ఆదేశించారు. సోమవారం తుని మండలం తేటగుంట క్యాంపు కార్యాలయంలో రూరల్ సీఐ చెన్నకేశవరావు, పట్టణ సీఐ గీతారామకృష్ణతో శాంతిభద్రతలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా, పేకాట, జూదం, కోడి పందేలు ఆడితే కఠినంగా శిక్షించాలన్నారు. జిల్లా సరిహద్దుగా ఉన్న తుని నియోజకవర్గంలో డ్రగ్ ముఠాలు ప్రవేశించకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని సూచించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థినికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

తొండంగి: మండలంలోని వేమవరానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. తునికి చెందిన పొన్నగంటి సత్యవేణి సాయిదుర్గాశ్రీ కాకినాడలోని సంజీవ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎంఎల్‌టీ మెడికల్స్ కోర్సు చదువుతోంది. పేదరికం కారణంగా ఆమె ఆర్థిక ఇబ్బందులు పడుతోందని తెలుసుకున్న శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రూ.14 వేల ఆర్థిక సాయాన్ని సమకూర్చారు.

ఈ మొత్తాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీనివాసరావు సోమవారం కాకినాడలో కళాశాలకు వెళ్లి విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, కళాశాల హెచ్ఓడీ నాగ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణపై గ్రామస్తుల ఆందోళన

తొండంగి: మండలంలోని కోదాడలో దళితుల శ్మశానవాటిక ఆక్రమణకు గురైందంటూ సోమవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దళిత నాయకుడు, సర్పంచ్ బూర్తి రత్నకుమారి భర్త బూర్తి నాని తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని 445 సర్వే నంబర్‌లో ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కొంతకాలంగా దళితులు శ్మశానవాటికగా వినియోగించుకుంటున్నట్టు తెలిపారు. ఓ వ్యక్తి ఆ భూమిలో సమాధులను సైతం తొలగించి ట్రాక్టర్‌తో దమ్ము చేశారని ఆరోపించారు. శ్మశానవాటిక ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట: మండలంలోని మామిడాడలో సారా బట్టీలపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్సై టి. రఘునాథబాబు తెలిపారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

భూమికి పట్టాలు ఇవ్వాలంటూ ధర్నా

రౌతులపూడి: మండలంలోని కోదూరు, పారుపాకలో పేదలు సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అలాగే మండలంలోని శృంగవరంలో సర్వే నంబరు 164/1ఏలో ఉన్న భూమిని ఎస్సీ పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు


ఇథనాల్ ఫ్యాక్టరీలో యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో నూతనంగా నిర్మించిన అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీని సోమవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సందర్శించారు. ఫ్యాక్టరీ నుంచి దుర్గంధం వెదజల్లడంతో పాటు తీవ్రమైన శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన పలువురు ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో గత వారం రోజులుగా ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ ఫ్యాక్టరీని సందర్శించి యాజమాన్యంతో మాట్లాడారు. స్థానికులు లేవనెత్తిన సమస్యలపై యాజమాన్యంతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ కంపెనీ నుంచి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యంతో చర్చించామన్నారు. ప్రస్తుతం కంపెనీలో సుమారు 2 లక్షల లీటర్ల ఇథనాల్ నిల్వ ఉన్నందున దాని ఎగుమతికి 20 రోజులు గడువు కోరారన్నారు. 20 రోజుల తరువాత సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల తరఫున తానే పోరాటం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.